TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.12, Himayatnagar, Hyderabad-500029,Telangana State, Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

24.10.2015

## పారిశ్రామిక విధానాలు క్షేత్రస్థాయిలో అమలు కావాలి

హైద్రాబాద్:

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో " నూతన తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల విధానం ప్రణాళిక – సూచనలు–సలహాలు" అనే అంశంపై 197వ చర్చా కార్యక్రమం జరిగింది.

ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ ప్రెసిడెంట్ వెన్నం అనిల్ రెడ్డి, టెక్కీ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ కుమార్, తెలంగాణ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కె.సుధీర్ రెడ్డి తదితరులు వక్తలుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా **ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ&ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ ప్రెసిడెంట్ వెన్నం అనిల్ రెడ్డి** మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు బాగా ఉన్నప్పటికీ, ఉన్నతస్థాయిలో తీసుకున్న నిర్ణయాలు కార్యరూపం దాల్చడంలో కొంత జాప్యం చోటు చేసుకుంటున్నది. ఉన్నతస్థాయిలో ఉన్నంత అంకితభావం కిందిస్థాయిలో కానరావడం లేదు. ఉన్నతాధికారుల కొరత కూడా ఇందుకు కారణమని చెప్పవచ్చు. ఒక్కో ఉన్నతాధికారి రెండు, మూడు విభాగాలు పర్యవేక్షించాల్సి వస్తోంది. మరొక ముఖ్యమైన అంశం ఏమిటంటే, మార్కెట్ ఇప్పుడు మందకొడిగా ఉంది. రెవిన్యూ లక్ష్యాలు చేరుకోవాలన్న తపన కారణంగా అధికారుల నుంచి వేధింపులు ఎదురుకావచ్చన్న అనుమానం వాణిజ్యవర్గాల్లో వ్యక్తమవుతోంది. వాణిజ్య పన్నుల విభాగం నుంచి వెలువడుతున్న కొన్ని ఉత్తర్వులు అసంబంద్ధంగా ఉంటున్నాయి. పాత తేదీలతో పన్ను వసూళ్ళు చేయడం తగదు. త్వరలో జీఎస్టీ అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో అధికారులు కొంత జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం విద్యుత్ రోజుకు 24 గంటలు ఉంటున్నప్పటికీ, అధిక మొత్తాలు వెచ్చించి విద్యుత్ కొనుగోలు చేస్తున్నాం. భవిష్యత్‌లో ఆ భారం ప్రజలపై, పరిశ్రమలపై పడే అవకాశం ఉంది. పెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వస్తేనే అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అవి ఇంకా పూర్తిస్థాయిలో రాలేదు. వాటిని తీసుకువచ్చేందుకు కృషి చేయాలి. ప్రసుత్తానికైతే పలు పరిశ్రమలు విస్తరణ యోచనలో ఉన్నాయి. జనవరి వరకు విస్తరణ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. బ్యాంకు రుణాల వడ్డీరేట్లు ఇంకా తగ్గాలి" అని అన్నారు.

**టెక్కీ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ కుమార్** మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ముందు రెండున్నరేళ్ళ పాటు కొంత అనిశ్చితి చోటు చేసుకుంది. పెద్ద పరిశ్రమలేవీ రాలేదు. నూతన రాష్ట్రం ఏర్పడిన

TRC
TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.12, Himayatnagar, Hyderabad-500029,Telangana State, Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

తరువాత దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని రూపొందించుకున్నాం. ఖాయిలా పరిశ్రమల సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగాల కల్పన జరగాలి. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రానికి సేవలు అందించిన పరిశ్రమలు ఇప్పుడు ఒక రాష్ట్రానికే అంటే పది జిల్లాలకే పరిమితమయ్యాయి. నిజానికి ఇది కూడా పెద్ద అడ్డంకి కాదు. పొరుగునే ఉన్న ఇతర రాష్ట్రాల్లో మార్కెట్ విస్తరణకు అవకాశాలున్నాయి. పోటీదాయక ధరల వాతావరణంలో పని చేసే పరిస్థితిని ప్రభుత్వం కల్పించాలి. మౌలిక వసతుల కల్పన, పన్నుల హేతుబద్ధీకరణలకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యుత్, ముడిపదార్థాలు లాంటి వాటి లభ్యత సరిగా ఉండేలా చూడాలి. రవాణాపరమైన సమస్యలను అధిగమిస్తూ చైనా వ్యాపారులు అతి తక్కువ ధరలకు వస్తువులు అందిస్తున్న నేపథ్యంలో వాటి కంటే చౌక రేట్లకు ఇక్కడ మనం ఆయా వస్తువులు అందించేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలి" అని అన్నారు.

**తెలంగాణ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కె.సుధీర్ రెడ్డి** మాట్లాడుతూ, "తెలంగాణ ప్రభుత్వం అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. అది కార్యరూపం దాల్చాలి. గత ప్రభుత్వాలు సెజ్‌ల పేరిట అటు ప్రజలను, ఇటు పారిశ్రామికవేత్తలను ఇబ్బందులకు గురి చేశాయి. హైదరాబాద్ చుట్టూ మాత్రమే గాకుండా ఆయా జిల్లాల్లో పరిశ్రమలు నెలకొనేలా చూడాలి. పెద్ద పరిశ్రమలతో పోలిస్తే చిన్న పరిశ్రమలతోనే ఉపాధి అవకాశాలు అధికం. అందుకే వాటిని ప్రోత్సహించాలి" అని అన్నారు.

**టీఆర్‌సీ చైర్మన్ యం.వేదకుమార్** ఈ సందర్భంగా మాట్లాడుతూ, మన రాష్ట్రంలోని సహజవనరులను దృష్టిలో ఉంచుకొని ఏయే జిల్లాల్లో ఎలాంటి పరిశ్రమలు నెలకొల్పితే బాగుంటుందో ఆలోచించాలన్నారు. ఇదే సందర్భంలో పర్యావరణాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. పారిశ్రామిక విధానాల రూపకల్పనలో పారిశ్రామికవేత్తలకు, వ్యాపారవర్గాలకు ప్రాతినిథ్యం కల్పించాలని, వారి సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పారిశ్రామిక విధానాల రూపకల్పన సమయంలో ఇతర రంగాలను కూడా దృష్టిలో ఉంచుకొని సమగ్రంగా ఆయా విధానాలను రూపొందించాలన్నారు.

ఆయా పరిశ్రమల ప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో బక్కా బాబూరావు, బి.వెంకటేష్,రావి వేణుగోపాల్ రెడ్డి, ఎం.సుధాకర్, విద్యాధర్‌రెడ్డి, వై.క్రిష్ణ, ఎస్.వెంకటనారాయణ .......తదితరులు పాల్గొన్నారు.

**నీరజ**
**టిఆర్‌సి**